

ఓం నమో భగవతే శ్రీ రమణాయ

# రమణ భాస్కర



సంపుటి : 8 | సంచిక : 16 | పుష్పం : 43 | 5-5-2003

**RAMANA BHASKARA**
TELUGU SPIRITUAL FORTNIGHT MAGAZINE
PAGES : 16
VOL : 8 ISSUE : 16
EDITOR
P.S. RAMA RAJU
EDITING
P.H.V. SATYAVATHI
(HYMA)
SUBSCRIPTION
Yearly : **Rs. 150/-**
Each Copy : **Rs. 8/-**
ADDRESS
**RAMANA BHASKARA**
SRI RAMANAKSHETRAM
JINNURU - 534 265
W.G.Dt., A.P.
PUBLISHER
P.S. RAMARAJU
LAKSHMI
MODERN RICE MILL
ULLAMPARRU - PALAKOL
☎ 08814 - 224589, 224689
PRINTER
SHRIRAM GRAPHICS
BANK STREET - PALAKOL
☎ 08814 - 222438, 221260

## సద్గురు శ్రీనాన్న గారి అనుగ్రహభాషణములు, 28-4-03, జిన్నూరు

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

ధనంకంటే మనం కాలానికి ఎక్కువ ప్రాముఖ్యత ఇవ్వాలి. ధనంపోతే సంపాదించుకోవచ్చు కాని జరిగిపోయిన కాలం తిరిగిరాదు. చాలామంది కాలాన్ని వృధా చేసుకొంటున్నారు. కాలాన్ని దుర్వినియోగం చేయటం అంటే భగవంతుడిని అగౌరవించినట్లు అవుతుంది. మీ ఇంటిదగ్గర పనులు మీరు శ్రద్ధగా చేసుకోండి, మిగిలిన కాలంలో మీకు నచ్చిన పద్ధతిలో సాధనచేసుకోండి. కొంతమందికి భక్తిమార్గం, కొంతమందికి జ్ఞానమార్గం, కొంతమందికి కర్మమార్గం ఇష్టం అవ్వవచ్చు. కాని ఆ మార్గాలద్వారా పొందేవస్తువు ఒక్కటే. మన ఋషులు, వారు పొందిన మార్గమును బోధించారు. మీకు ఇష్టమైన మార్గములో ప్రయాణం చేయండి, అనుకరణవద్దు. అనుకరణ పరికివాడి లక్షణం, ధైర్యవంతుడి లక్షణం కాదు. మీరు భౌతికంగా, ఆధ్యాత్మికంగా బాగుపడాలి. అందంగా కనిపించటం కోసం చాలామంది వస్తువులు అలంకరించుకొంటారు. శాస్త్రములో ఏమి చెప్పారు అంటే ఇదే అందం అని మీరు అనుకొంటున్నారు కాని ఇంతకంటే అందం ఉంది చెవులతో నిరంతరం మంచిమాటలు వింటూఉంటే అది చెవులకు అందం, మనం నోటితో మంచిమాటలు మాట్లాడాలి అది నోటికి అందం, కళ్ళతో మంచిమంచి దృశ్యాలు చూడాలి అది కళ్ళకు అందం ఇలా మనం చెవులను, నోటిని, కళ్ళను ఉపయోగించుకొంటే వాటికి అందాలు వస్తాయి ఆనందం అందుతుంది అని చెప్పారు. సమాజంలో హెచ్చుతగ్గులు ఉంటాయి, మంచివారు చెడ్డవారు ఉంటారు, సమాజమును ఎవరూ సమానం చేయలేరు. గాంధీగారు ఏమి చెప్పారు అంటే నీకు మంచివారు ఎదురైతే నీలోని లేని మంచివారిలో ఉంటే ఆమంచిని నేర్చుకోవటానికి ప్రయత్నంచెయ్యి, నీకు చెడ్డవారు ఎదురైతే వారిని ద్వేషించవద్దు, ఉదాసీనంగా ఉండు, వారిలో ఉన్న చెడ్డనీలో ఉందేమో చూసుకొని అది నీలో ఉంటే దానిని తొలగించుకో, ఒకరకంగా మంచివారు, చెడ్డవారు కూడా నీకు గురువులే అని చెప్పారు.

**ఈ సంచికలో......**

**సద్గురు శ్రీ నాన్నగారి అనుగప్రాభాషణములు**

28-4-03 జిన్నూరు ........ 1
చైతన్య జాగృతి ........ 7



మనం ట్రైనింగ్ పొందటానికి ఈ భూమి మీదకు వచ్చాము. జీవితంలో మనం అనేక పాఠాలు నేర్చుకోవాలి. మనం ఆధ్యాత్మికంగా ట్రైనింగ్ పొంది వివేకవంతులం అవ్వాలి, హృదయం యొక్క లోతులు పెరగాలి. కెరటాలు తగ్గాక సముద్రంలో స్నానం చేద్దాము అంటే మనం స్నానం చేయలేము, కెరటానికి కెరటానికి మధ్యన స్నానం చేసిరావాలి. అలాగే ప్రపంచంలో హెచ్చుతగ్గులు ఉంటాయి, అనేక భిన్న మనస్తత్వం గలవారు ఉంటారు, వారిలో అంతర్యామిగా ఉన్న ఈశ్వరుని చూడటం మనం నేర్చుకోవాలి. దండలో పుష్పాలకు దారం ఎలా ఆధారంగా ఉందో అలాగ ఈనామరూపాలకు ఈశ్వరుడు ఆధారంగా ఉన్నాడు. అందరి హృదయాలలో ఉన్న ఈశ్వరుని చూడటం మనం నేర్చుకొంటే మనకు బేధబుద్ధి తగ్గిపోతుంది. ఈ శరీరంభూమిమీదకు ఎందుకు వచ్చిందో దాని ద్వారా ఆ పని జరుగుతూ ఉంటుంది, అది ఈశ్వరుడు చూసుకొంటాడు, ఆగోల మనకు ఏల? మనం ఆధ్యాత్మికంగా ట్రైనింగ్ పొందాలి. సినిమా తెరమీద వరదలు వచ్చినట్లు కనిపిస్తాయి కాని తెర ఏమీ తడిసిపోదు, తెరమీద అగ్నికనిపిస్తుంది కాని అదితెరను కాల్చదు అలాగే ఈ ప్రపంచంలో ఏ సంఘటనజరిగినా అది హృదయంలో ఉన్న బ్రహ్మంనుతాకదు. మనం సహజంగా ఉండటానికి పెద్ద తెలివితేటలు అక్కరలేదు, అసహజంగా ఉండటానికే తెలివితేటలు ఉండాలి. నీ హృదయంలో ఒకనిజం ఉంది. నీవు సహజంగా జీవించటం నేర్చుకొంటే నీవు నిజంలోనే ఉంటావు. దైనందిన జీవితంలో మనం క్రమశిక్షణగా జీవించటం నేర్చుకొంటే జ్ఞానం దగ్గరకు మనం వెళ్ళనక్కరలేదు, జ్ఞానమే మనదగ్గరకు వస్తుంది. ఎక్కడైతే ప్రేమఉందో ఆ ఉపాధి ద్వారా ఎంతో కొంత సేవ జరుగుతుంది. ప్రేమ ఉన్నచోట సేవఉంటుంది, సేవ ఉన్నచోట త్యాగం ఉంటుంది, త్యాగం ఉన్నచోట జ్ఞానం ఉంటుంది, జ్ఞానం ఉన్నచోట శాంతిఉంటుంది. మనకు ఎంత పాండిత్యం ఉన్నా ఎన్ని సంపదలు ఉన్నా దుఃఖంనశించదు భౌతికసంపదలు ఎన్నివచ్చినా అవి ఏ దారిన వచ్చాయో ఆదారినే వెళ్లిపోతాయి మీకు ఆసంపదవచ్చినప్పడే అది ఏదారినపోవాలో నిర్ణయింపబడి ఉంటుంది. మరి దుఃఖం ఎప్పడు నశిస్తుంది? నీవు ఎవడివో నీకు తెలియనంతకాలం నీకు ఆత్మజ్ఞానం కలుగదు. ఆత్మజ్ఞానం కలుగకపోతే నీకు దుఃఖం నశించదు, సంసారం నశించదు. ఒక్క ఆత్మజ్ఞానం వలననే నీవు దు:ఖంలో నుండి విడుదల పొందుతావు. నీమనస్సును బాహ్యాముఖంచేయటానికి ప్రపంచంలో అనేక

ఆకర్షణలు ఉన్నాయి. ఇందులో దేనికి ఆకర్షింపబడకుండా ఉంటే నీవు ఆత్మజ్ఞానానికి ఫిట్ అవుతావు. మనం శరీరంగా ఉండటానికి, మనస్సుగా ఉండటానికి నటించాలిగాని ఆత్మగా ఉండటానికి నటించటం ఎందుకు? నీవు కృత్రిమంగా జీవించటానికి నటించాలి గాని సహజంగా జీవించాలి అనుకొన్నప్పడు నటన అక్కరలేదు. సాధన అనేది సహజంగా జరగాలి, సహజంగా జరిగితే ఎక్కువసేపు చేయగలము.

మనస్సు అంటే తలంపుల సమూహము కోపాలు, తాపాలు, ఇష్టాలు, అయిష్టాలు అన్నీ మనస్సులో ఉన్నాయి. మనస్సును పట్టించుకోకుండా ఉంటే అవి అన్నీపోతాయి. ఆమనస్సే నీవు అనుకొంటున్నావు అందువలన దానిని పట్టించుకొంటున్నావు. అది నేను కాదుఅని మనస్సును వదిలేస్తే అన్నీ పోతాయి. మనం కానిదానితో తాదాప్యం తగ్గించుకొంటూ రావాలి. మాయ అనేదిఈశ్వరుడు పన్నిన వల, ఆయన పాదాలను ఆశ్రయించకుండా ఆయన వలలోనుండి బయటకు రాలేము. మనం వలవేస్తే ఆవలకంటే పెద్దచేపలు ఉంటే అవి వలలో పడవు. అలాగే కొంతమంది వలలో పడరు, వారు జ్ఞానయోగులు. కొన్ని చిన్న చేపలు వలరంధ్రాలనుండి తప్పకొంటాయి, వారు భక్తియోగులు. మనం అటు ఇటు కాకుండా ఉన్నాము వలలోపడిపోతున్నాము, తీసుకొనివెళ్లి దాకలో వేస్తున్నారు అంటే చనిపోతున్నాము మరల పునర్జన్మలు వస్తున్నాయి. నీవు చిన్న చేపకాదు అనుకో, పెద్ద చేపకాదు అనుకో నీవు తరించటానికి కూడా ఒక ఉపాయం ఉంది అని రామకృష్ణుడు చెప్పాడు. వలవేసే వాడి పాదాల దగ్గర ఉన్న చేపలు వలలోపడవు, మీరు ఈశ్వరుని పాదాలను ఆశ్రయిస్తే ఆయన వేసిన మాయ అనే వలలో పడరు.

నీహృదయంలో ఉన్న సత్యాన్ని అన్వేషించటానికి చిత్తశుద్ధిఉండాలి. మనం ఏపనిచేసినా చిత్తశుద్ధితో చేయాలి. కామ్యకర్మలు చేసేవాడికి చిత్తశుద్ధిరాదు, కర్మఫలత్యాగికి చిత్తశుద్ధికలుగుతుంది. చిత్తశుద్ధితో మనం ఏపనిచేసినా మేలు జరుగుతుంది. చిత్తశుద్ధిలేకుండా, ఆత్మవిశ్వాసంలేకుండా ఆత్మజ్ఞానం కలుగదు. చెడుస్నేహాలవలన, విషయచింతన వలన, ఉపయోగంలేని గ్రంధాలు చదవటం వలన, అనాత్మను చింతించుట వలన నీబుద్ధిపాడైపోతుంది. నీబుద్ధి పాడైపోయాక నీకు ఎన్ని ఉంటే లాభం ఏమిటి అంటున్నాడు పరమాత్మ. బాగా తాగినవాడు కారుడ్రైవ్ చేస్తూ ఉంటే ఆకారులో ఉన్నవారి పరిస్థితి ఎలాగ ఉంటుందో మన బుద్ధి పాడైపోతే మన పరిస్థితి అలాగే ఉంటుంది. నోటితో ఆత్మను పొందాలి అనటం, ఆలోచించటం మటుకు అనాత్మ విషయాలగురించి ఆలోచించటం ఇంకనీకు ఆత్మజ్ఞానం ఏమిటి? నీవు హృదయం యొక్క లోతులలోనికి వెళ్ళకోలది, హృదయంలో ఉండటం నేర్చుకొనేకొలది నీవు ఏ విషయాలనయితే తొలగించుకోవాలి అనుకొంటున్నావో అవి నిన్ను వదిలిపెట్టి పోతాయి, వాటిని తొలగించుకోవటానికి నీవు ప్రత్యేకంగా ప్రయత్నం చేయనక్కరలేదు. మనోదేహములతో మనకు ఉన్న తాదాప్యం తగ్గించుకోవటానికే సాధన. నీకు జ్ఞానం కలిగాక సాధన



చేయటానికి ఏమీ మిగలదు. లోపలఉన్న వస్తువు తెలియనంత వరకు నీవు ఏదో ఒకటి చేయకుండా ఉండలేవు. నీవు పొందవలసింది పొందాక ఇంక చేయటానికి ఏమీ మిగలదు, అప్పడు మనం మనంగా ఉంటాము, సహజంగా ఉంటాము. నీవు వైరాగ్యాన్ని పెంచుకో. ఆత్మధ్యాస తప్పించి ఇతర చింతలు రాకుండా చూసుకో. పనిమానివేయటం వైరాగ్యంకాదు. అనాత్మబుద్ధిని ధ్వంసం చేయటమే వైరాగ్యం. అనాత్మబుద్ధిని ధ్వంసం చేయకపోతే నీకు ఆత్మబుద్ధి కలుగదు. ఆత్మజ్ఞానం కలిగేవరకు మనకు ప్రయాణాలు ఉంటాయి, అనేక లోకాలలో ప్రయాణంచేస్తాము. మనం ట్రైనింగ్ పొందాలంటే తిరిగి ఈభూమిమీదకు రావలసిందే. అందుచేత ఇప్పడు కాలాన్ని సద్వినియోగం చేసుకో. మనం ఏదైనా ఒక మాట మాట్లాడితే ఆమాట ఇతరులకు చల్లదనం కలుగజేయాలి, శాంతిని కలుగజేయాలి. లేకపోతే నోరుమూసుకొని కూర్చోవటం మంచిది. ఆత్మస్మరణ విడిచిపెట్టవద్దు, ఆవస్తువులభించే వరకు నీప్రయాణం మానవద్దు, మనం బహుజాగ్రత్తగా ఉండాలి, అశ్రద్ధ పనికిరాదు. భక్తిభావన లేనివారితో, విశ్వాసహీనులతో స్నేహం వద్దు, పాములను చూస్తే ఎలా పారిపోతామో అలావారిని చూసి పారిపోండి, వారితో సహవాసం వలన మనకుఉన్న కొద్దిపాటి విశ్వాసంకూడా పోతుంది. మా ఇంట్లోవారు ఎవరూ సరిగా పలకరించటం లేదు అని చాలామంది అంటారు. అలా పలకరించకపోతే మనకే మంచిది, వారి పలకరింపులమీద ఆధారపడి ఎంతకాలం బ్రతుకుతాము. వారు బాగా పలకరించటం వలన, బాగాచూడటం వలన వారిమీద మమకారం పెరుగుతుంది, చివరకు వారిని స్మరిస్తూ చనిపోతాము. చేస్తే సత్పురుషులతో సహవాసం చేయండి లేకపోతే ఏకాంతవాసంగా ఉండండి. కాఫీ దొరకలేదు ఎండ్రిన్ ఎదురుగా ఉంది అని ఎండ్రిన్ త్రాగుతామా? త్రాగము. అలాగే సత్పురుషుల సాంగత్యము దొరకలేదు అని దుష్టసాంగత్యం చేయవద్దు, ఏకాంతంగా ఉండండి. బాధ్యతలువిడిచిపెట్టి ఎక్కడికి పారిపోవద్దు. మీ పనులు మీరు శ్రద్ధగా చేసుకోండి. కొద్దిసేపు జపధ్యానములు చేసుకోండి, సత్పురుషుల సహవాసం చేయండి ధ్యానం వలన పవిత్రత, ఏకాగ్రత వస్తుంది. భగవంతుడు ఒకోసారి మనలను పరీక్షలకు గురి చేస్తాడు. మీరు కంగారు పడవద్దు మనలను మరింత పవిత్రులను చేసి, మనకు ఏకాగ్రత కలుగజేసి జ్ఞానానికి ఫిట్ అవ్వటానికి అలా చేస్తాడు అంతేగాని మనమీద విరోధంతో కాదు.

ఈరోజు రమణుడు శరీరం విడిచిపెట్టినరోజు. రమణుడు అంటే శరీరంకాదు, ఆత్మ. ఆయనకు శరీరం ఉన్నా, లేకపోయినా ఒక్కటే. ఇంకో నాలుగు రోజులకు భగవాన్ శరీరం విడిచిపెడతారు అనగా ఒకరు భగవాన్‌ను ప్రశ్నఅడిగారు. మీ శరీరంపోతే మమ్మలను ఎవరు ప్రేమిస్తారు అని? శరీరం ఉన్నప్పడుకూడా ఈశరీరం కాదు మిమ్మల్నిప్రేమించేది, ఏదైతే మిమ్మలను ప్రేమిస్తోందో దానికి చావులేదు, ఈశరీరం పోయిన తరువాత కూడా అది ఉంటుంది, దానికి శరీరానికి సంబంధంలేదు అని చెప్పారు. మా అత్తగారికి నామీద ఉన్నకోపం తగ్గించమని ఈమధ్యన ఒకకోడలు నన్ను అడిగింది. అత్తగారికి ఉన్న

కోపంతగ్గించమని నన్ను అడగవద్దు, నువ్వు ఆకోపాన్ని చూడటం మానివెయ్యి, లోపలఉన్న ఈశ్వరుడిని చూడటం నేర్చుకో. ఈశ్వరుడిని చూడటం నేర్చుకొంటే ఇంక నీకు కోపం కనబడదు, అప్పుడు నీకు రెండు లాభములు ఆవిడ కోపంనుండి నీవు బయటపడతావు, నీకు జ్ఞానం కలుగుతుంది. దృష్టిమార్చుకో దృశ్యం మారుతుంది, తంటా వదిలిపోతుంది అని చెప్పాను. మనలో ఏదైనా విశేషం ఉంటే రాముడిలో ఉన్న విశేషం,రామకృష్ణుడిలో ఉన్న విశేషం మనకు తెలుస్తుంది. మనలో ఏమీ లేకపోతే వారిలో విశేషం ఉన్నా అది మనకు తెలియదు. మనం మంచి వారము కాకపోయిన మంచివారిని గౌరవించే యోగ్యత మనం పోగొట్టుకోకూడదు, రామకృష్ణుడు ఎంతటివాడో అంతమంచివారం మనం కాకపోవచ్చు. అంతమాత్రం చేత రామకృష్ణుడిని గౌరవించే యోగ్యత పోగొట్టుకోనక్కరలేదు, అంత దిగజారిపోకూడదు. మా కొంపలో రాగద్వేషములు ఎప్పడు తగ్గుతాయి అని చూడకుండా రాగద్వేషముల మధ్యన సమానంగా జీవించటం నేర్చుకోండి. పూర్వజన్మలో మీరు ఏదో పుణ్యకర్మచేసారు, సత్కర్మ చేసారు మీరుచేసిన పుణ్యకర్మ, సత్కర్మ మిమ్మలను ఇక్కడికి తీసుకొని వచ్చాయి గాని మీ తెలివితేటలవలన మీరు ఇక్కడకు వచ్చారుఅని నేను అనుకోవటం లేదు, ఎందుచేతనంటే మీకంటే తెలివిగలవారు లోకంలో కొన్ని లక్షలమంది ఉన్నారు. బ్రహ్మంతో పోల్చితే మనతెలివి ఎంత? మనం ఎంత?

1950 సం॥ ఏప్రియల్ 14వ తేదీ రాత్రి గం॥ 8-47 ని॥లకు భగవాన్ శరీరాన్ని విడిచిపెట్టారు. ఆయన కొన్ని క్షణాలలో శరీరాన్ని విడిచిపెడతారుఅనగా అక్కడ ఉన్నభక్తులు అరుణాచలశివ, అరుణాచలశివ అని చాంటింగ్ చేస్తున్నారు అప్పటివరకు ఆయన కళ్ళు మూసుకొని ఉన్నారు, అరుణాచల స్మరణ ఆయన చెవిలో పడింది, ఒక్కసారి కళ్లుతెరవబడ్డాయి, కళ్ళవెంట బొటబొట నీరుకారింది ఎందుచేతనంటే అది ఈశ్వరుడి పట్ల ఆయనకు ఉన్న ప్రేమకు, ప్రీతికి గుర్తు. మేము ఎక్కడ నుండో వచ్చాము, ఇప్పడు మీ శరీరం పడిపోతోంది. మీకు మాకు సంబంధం తెగిపోతుందా? మా మాట ఏమిటి అని ఒకరు భగవాన్‌ను అడిగితే పూర్వజన్మలో ఏ సంబంధంలేకుండానే ఇక్కడ కలుసుకొన్నామా, ఈ సంబంధం మనలను మరొక చోట కలపదా అన్నారు భగవాన్, వారికి ఆత్మవిశ్వాసం, ఆనందం కలిగింది. ఒకసారి ఎవరోవచ్చి భగవాన్ దగ్గర కూర్చొన్నారు వారుఎవరు, వారుఎవరు అని అక్కడ ఉన్నవారు అడుగుతున్నారు. భగవాన్ ఏమి చెప్పారు అంటే వారుఎవరు వారుఎవరు అని అడుగుతున్నారు, ఎవరో అయితే మన దగ్గరకు ఎందుకు వస్తారు, మనవారు కాబట్టే మనదగ్గరకు వచ్చారు అని చెప్పారు, ఆ ఆప్యాయత చూడండి. అసలు రమణప్రేమ మీ హృదయానికి అందుతూ ఉంటే మీకు ఊపిరిఆడదు. అరుణాచలం అంటే ఆయనకు జనకభావన ఉండేది. అరుణాచలం వచ్చిన మొదటి రోజున ఓతండ్రీ నీ ఆజ్ఞననుసరించి వచ్చాను, నాఅంతట నేను రాలేదు,. ఈశరీరాన్ని ఎలా ఉపయోగించుకొంటావో అలా ఉపయోగించుకో, ఈశరీరాన్ని నీస్వాధీనం చేస్తున్నాను అన్నాడు, అది శరణాగతి.



పులినోటిలోపడ్డ మాంసపు ముక్క బయటకురాదు. అలాగే ఒకజ్ఞాని హృదయంలో పడ్డవాడు ఏనాటికైనా తరించబడతాడు కాని వాడిని విడిచిపెట్టడు, వాడు ఏజన్మలో ఉన్నా వాడిని చూసుకొంటూఉంటాడు, వాడేగురువు, వాడే ఈశ్వరుడు. భగవాన్ అరుణాచలంవచ్చిన కొత్తలో ఆకలిబాధ, ఇప్పడు అజీర్తిబాధ అప్పడు ఆ శరీరం అలా ఉండవలసివచ్చింది, ఇప్పడు ఇలా ఉండవలసివచ్చింది అది దేహానికి సంబంధించినది, జ్ఞానంలో ఏమీ తేడాలేదు. అప్పడు దేహం రాళ్ళ మీద కూర్చోవలసివచ్చింది, ఇప్పడు సోఫాలో కూర్చొవలసివచ్చింది. ఇది అంతా చూసేవాడు అనుకొంటాడు గాని నేను సోఫాలో కూర్చున్నాను అని జ్ఞాని అనుకోడు. తాను దేహమాత్రుడను కాదు అని జ్ఞానికి తెలుసు. అంతా జ్ఞానమే. అంతా బ్రహ్మమే. దేవుడు ఎక్కడ ఉన్నాడు అని ఒకరు ఒక కృష్ణభక్తుడిని అడిగారు. ఆ కృష్ణభక్తుడు ఏమిచెప్పాడు అంటే దేవుడు ఎక్కడలేడో చూపించు అన్నాడు. అదే హిరణ్యకశిపుడు ప్రహ్లాదుడిని అడుగుతాడు దేవుడు ఎక్కడ ఉన్నాడు అని? అంతటా ఉన్నాడు అని ప్రహ్లాదుడు చెపితే అయితే ఎదురుగా ఉన్న స్థంబం చూపించి ఈ స్థంబంలో ఉన్నాడా అని అడుగుతాడు, ఉన్నాడు అని ప్రహ్లాదుడు చెపుతాడు, అప్పడు ఆ స్థంబాన్ని తన్నితే అందులోనుండి నరశింహస్వామి వస్తాడు. జ్ఞానికి అంతా బ్రహ్మమయం. రమణభగవాన్ శరీరం ధరించిన రోజున ఆపురిటిగదిలో ఒక కళ్ళులేనివాడికి జ్యోతి దర్శనం అయ్యింది. మరల ఆయన శరీరం విడిచిపెట్టినరోజున జ్యోతిరూపంలో అరుణగిరిలో ఐక్యమయ్యారు. ఆయన జ్యోతిస్వరూపుడు, అరుణాచలం అగ్నిలింగం. రమణమహర్షిగారు అరుణాచలం రావటంకాదు, అరుణాచలేశ్వరుడే తిరుచ్చిళిలో జన్మించి తిరిగి అరుణాచలం వచ్చేసాడు. అరుణాచలం అచలం, రమణుడు చలం. అరుణగిరి కదలదు, ఈయన కదిలాడు. ఆయన కదలనిదేవుడు, ఈయన కదిలేదేవుడు. అంతే తేడా ఇద్దరికి. ఈశ్వరుడికి భిన్నంగా ఏదైనా ఉంది అనుకొంటే అది మన అజ్ఞానానికి గుర్తు. అంతా ఈశ్వరుడే. భగవాన్ ఎక్కడకు యాత్రలకు వెళ్ళలేదు, ప్రసంగాలు చేయలేదు. 54 సం॥లు అరుణాచలక్షేత్రం విడిచిపెట్టలేదు. ఈ అరుణాచలం విడిచిపెట్టి ఎక్కడికైనా వెళ్ళాలి అనే తలంపు కూడా రాలేదు అన్నారు భగవాన్, తలంపు వచ్చిన తరువాత నిగ్రహించుకోవటం కాదు. అదుణాచలేశ్వరుడితో ఆయనకు ఉన్న అనుబంధం అటువంటిది. ఆభక్తికలిగినవారు అదృష్టవంతులు. ఓ అరుణాచలేశ్వరుడా, నన్ను నీ భక్తుడిగా చేసుకో, ఒకవేళ నీ భక్తుడిగా ఉండటానికి తగిన యోగ్యతనాకు లేదు అనుకో, నీ భక్తులకు భక్తుడిగా అయినా తయారుచెయ్యి అని అక్షరమణమాలలో భగవాన్ అన్నారు.

# చైతన్య జాగృతి

2002, నవంబరు, అరుణాచల కార్తీకదీపోత్సవ పర్వదినాన, తిరువణ్ణామలైలోనున్న "శ్రీనాన్న ఆశ్రమము"లో రమణతత్వాన్ని గూర్చి జాన్ డేవిడ్ అను పాశ్చాత్య భక్తుడికి - సద్గురు శ్రీనాన్న గారికి మధ్యన జరిగిన ఆంగ్ల సంవాదానికి అనువాదమే ఈ "చైతన్య జాగృతి"- (అనువాదం: డా॥ కె. రామారావు)

ప్రశ్న: భగవాన్ శ్రీ రమణమహర్షి "నేను ఎవడను?" అని ప్రశ్నించుకొని, విచారణ చేయమని చెప్పారుగదా - మరి "మీరెవరో" మేము అడుగవచ్చునా?

శ్రీనాన్న గారు : నేను మృత్యువు లేని ఆత్మను.

ప్రశ్న: ఆత్మానుభూతికోసము పాశ్చాత్యులెందరో భారతదేశము వస్తున్నారు - ఏమిటి ఆ ఆత్మానుభూతి?

శ్రీనాన్న గారు : ఆత్మను తన స్వరూపముగా అనుభవములోనికి తెచ్చుకోవటమే.

ప్రశ్న: ఇంకా కొంచము వివరముగా చెప్పగలరా?

శ్రీనాన్న గారు : ఉన్న సత్యమును తనస్వరూపముగా అనుభవములోనికి తెచ్చుకొనుటయే జ్ఞానము. జ్ఞానము కలిగేవరకు, ఆత్మదర్శనము అయ్యేవరకు ఏ జీవుడికి స్వేచ్ఛలేదు, వాడు స్వతంత్రుడు కాడు. ఆత్మను దర్శించిన జ్ఞాని మాత్రమే జననమరణములను దాటిపోతాడు, బంధములో నుంచి బయటపడతాడు.

ప్రశ్న: ఏదో సాధనచేసి జ్ఞానాన్ని పొందాలని పాశ్చాత్యులు భారతదేశము వస్తున్నారు - అది నిజమేనా?

శ్రీనాన్న గారు : మనస్వరూపమే జ్ఞానము. జ్ఞానాన్ని మనము సంపాదించనక్కరలేదు, మనల్ని ఆవరించిన అజ్ఞానాన్ని విడిచిపెడితే చాలు ఉన్న జ్ఞానము వ్యక్తమౌతుంది.

భారతదేశము సనాతనమైన ఆధ్యాత్మికభూమి, ఆత్మజ్ఞానులకు నిలయము. ఎందరో ఋషులు, ఆచార్యులు, ప్రవక్తలు, ముముక్షువులు పుట్టిన పవిత్రభూమి యిది. పాశ్చాత్యులు ఆధ్యాత్మిక విషయములను భారతదేశము నుంచి నేర్చుకోవాలి, భారతీయులు విషయపరిజ్ఞానాన్ని, సమాజసౌభాగ్యాన్ని పాశ్చాత్యులనుంచి నేర్చుకోవాలి.

భారతదేశము ఆధ్యాత్మికకేంద్రము. ఇక్కడ ఒక్కరిద్దరే కాదు, ఎందరో ఆత్మానుభూతి పొందిన మహాత్ములున్నారు. అందులో కొందరుమాత్రమే మనకు తెలియవచ్చు, మిగిలినవారు తెలియకపోవచ్చు. మహాత్ముల సన్నిధిలో, సత్యాన్ని తెలుసుకోవాలని, దానిని అనుభవములోనికి తెచ్చుకోవాలని, ఆ సత్యములో జీవించాలని అతిబలీయమైన తపన కలుగుతుంది. అందుకే పాశ్చాత్యులు భారతదేశము వస్తున్నారు.

భారతదేశములో అతిపురాతనమైన, పవిత్రమైన పుణ్యక్షేత్రాలు ఎన్నోవున్నాయి. ఆత్మసింహాసనాన్ని అధిరోహించిన చక్రవర్తులు, ఋషులు, మునులు, యోగులు ఎందరోవున్నారు. అట్టి పవిత్ర పుణ్యక్షేత్రాలను దర్శించి పునీతులు కావాలని, మహాత్ములను సేవించి తరించాలని పాశ్చాత్యులు వస్తున్నారు. నిజాన్ని అనుభవములోనికి తెచ్చుకొనేవరకు ఏ జీవికి స్వేచ్ఛలేదు. నిజము తెలిసేవరకు తెలియుట, తెలియకపోవుట అనే ఈ ద్వంద్వాలను దాటలేరు.

ప్రశ్న: ఆ నిజాన్ని గురించి ఇంకాకొంచము వివరముగా చెప్పగలరా?

శ్రీనాన్న గారు : ఉన్న నిజము ఆత్మ ఒక్కటే. ఆత్మ ఒక్కటే చైతన్యము, మిగిలినదంతా జడమే. ఆత్మ నిత్యమైనది, సత్యమైనది, శాశ్వతమైనది, స్వతంత్రమైనది, స్వయంప్రకాశమైనది. ఆత్మ ఆనందస్వరూపము, శాంతిస్వరూపము, సుఖస్వరూపము, జ్ఞానస్వరూపము. అది అనంతము, అఖండము, అమరము, అద్వితీయము, అనిర్వచనీయము, అవ్యయము, అభౌతికము, అలౌకికము. మన ఆచారవ్యవహారాలకు, కష్టసుఖాలకు, చావుపుట్టుకలకు ఆత్మ అతీతమైనది. ఈ ద్వంద్వాలు అన్నీ మానవమానస కల్పితము, కాని ఆత్మ మాత్రము మానవ కల్పితము కాదు. అది ఎప్పుడూ ఉంది, ఉంటుంది. అది మీకు తెలిసినా, తెలియక పోయినా ఉంది. అట్టి ఆత్మను మనము అంగీకరించి తీరాలి.

ప్రశ్న: అయితే, మేము దేనినైతే శోధించి, సాధించాలని భారతదేశము వస్తున్నామో, ఆ ఆత్మే మేమన్నమాట?

శ్రీనాన్న గారు : ఔను! ఆ ఆత్మ మీరు అయ్యే ఉన్నారు. మీరు మాత్రమే కాదు, ఈ సృష్టిలో ప్రతీజీవుడు ఆత్మయేఅయి ఉన్నాడు. ఆ నిజము తెలిసినవాడు జ్ఞాని, తెలియనివాడు అజ్ఞాని. ప్రతీమనిషి హృదయములోను దేవుడు ఆత్మస్వరూపములో ఉన్నాడు. ఆ నిజము తెలిసినవాడు ద్వంద్వాలను దాటిపోతాడు, బంధములోనుంచి బయటపడతాడు, ఋషి అవుతాడు. తనలోనున్న ఆ నిజము తెలియనివాడు శవబుద్ధిని వీడలేక, శివబుద్ధిని పొందలేక, బంధాలను తెంచుకోలేక, ద్వంద్వాలను దాటలేక, పరిసరాలను అతిక్రమించలేక, రాగద్వేషాలకు లొంగిపోతాడు, జీవుడిగానే మిగిలిపోతాడు. ఆత్మ మన నమ్మకాలమీద ఆధారపడి లేదు, అది స్వతంత్రమైనది. అది ఎప్పుడూ ఉంది. ఆ ఆత్మను తెలుసుకుంటే మీరు దుఃఖసాగరాన్ని దాటిపోతారు, ఆనందసాగరంలో ఈదులాడతారు. ఆత్మను తెలుసుకునే వరకు దుఃఖం మిమ్మలను వెన్నంటి తరుముకొస్తుంది, జననమరణచక్రములోనికి నెట్టివేస్తుంది. ఆత్మ ఒక్కటి మాత్రమే దుఃఖానికి అతీతమైనది, బంధానికి అతీతమైనది, ద్వంద్వాలకు అతీతమైనది, చావులేనిది.

ప్రశ్న: మేము ఆత్మ అయివుండి ఆ నిజము తెలుసుకొనుటకు భారతదేశము వచ్చుట చాలా చిత్రముగా ఉంది!

శ్రీనాన్న గారు : ఔను! మీరు ఆత్మస్వరూపులే. అందులో సందేహము లేదు. కాని మీ హృదయములోనున్న ఆత్మను తెలుసుకునే దారి చూపించువారికోసమే మీరు ఈ దేశము వస్తున్నారు. ఒక ఋషినిగాని, జ్ఞానినిగాని, యోగినిగాని మీరు దర్శించకపోతే బాహ్యదృష్టి వీడదు, లోదృష్టి కలుగదు, మనస్సు పరిధిలో నుంచి, దేహపరిధిలో నుంచి మీరు బయటపడలేరు. మహాత్ముల దర్శనము వలన మనస్సుకు పరిపక్వత వస్తుంది. సత్పురుషుల సాన్నిధ్యములో సత్యాన్ని తెలుసుకోవాలనే తపన కలుగుతుంది.

ప్రశ్న: మీ సన్నిధిలో మాకెందుకు ఆనందముగా ఉంటున్నదో ఇప్పుడు నాకు అర్థమైనది.

శ్రీనాన్న గారు : మీరు అర్థము చేసుకున్నందుకు సంతోషిస్తున్నాను.

ప్రశ్న: మీకళ్ళు చాలా అందముగా ఉంటాయి. వాటిలో ఏదోకాంతి ఉంది!

శ్రీనాన్న గారు : ఆ కాంతి మనోదేహములకు అతీతమైనది.

ప్రశ్న: మేము జ్ఞానము పొందుటకు ఏవైనా అర్హతలు కావాలా లేక సాధన సరిపోతుందా?

శ్రీనాన్న గారు : జ్ఞానము పొందుటకు అర్హతలు తప్పకుండా కావాలి. అందులో "పవిత్రత" అతిప్రధానమైనది. మీరు పవిత్రులగుటకు మనస్సు, మాట, చేత ఇవి మూడు ఒక్కటిగా ఉండాలి. హృదయముతో మనస్సుకు అనుసంధానము ఉండాలి మనస్సుతో ఆలోచిస్తున్నదే నోటితో చెప్పాలి, నోటితో చెప్పినదే చేతలలో ఆచరించాలి. అలా జీవిస్తే మీ అంతఃకరణము శుద్ధియై, మీరు పవిత్రులౌతారు. పవిత్రత ఉన్నవాడి మనస్సు అదుపులో ఉంటుంది. మనోనిగ్రహము ఉన్నవాడు తన మనస్సును హృదయమువైపు గురిపెట్టి ఉంచగలుగుతాడు. మనస్సును దాని పుట్టుచోటైన ఆత్మలో స్థిరముగా నిలిపి ఉంచితే, అది ఆత్మాకారము చెందుతుంది.

ప్రశ్న: మనస్సుకు అదుపు అంటున్నారే - ఏమిటా అదుపు?

శ్రీనాన్న గారు : బాహ్యముఖమే అజ్ఞానము. బాహ్యముగా పరుగెడుతున్న మీ మనస్సును నిరోధించి, అంతర్ముఖపరచి, హృదయమువైపు గురిపెట్టి, దాని పుట్టుచోటైన ఆత్మలో స్థిరముగా నిలిపిఉంచుటకు ప్రయత్నము చేయాలి. మనస్సు బహిర్ముఖమైతే వ్యర్థమైన చింతలు వస్తాయి, దేహగతమైన, మనోగతమైన రుగ్మతలకు గురిచేస్తాయి. కేవలము ఆధ్యాత్మికజీవితానికే కాదు, భౌతికజీవితానికి కూడా మనోనిగ్రహము చాలా ముఖ్యము. మనోనిగ్రహమును సాధించుటకంటే మించినపని మరొకటిలేదు.



ప్రశ్న: మనోనిగ్రహమునకు మీరేదైనా మార్గము చెపుతారా?

శ్రీనాన్న గారు : ఉపాసన వలన మనోనిగ్రహము సాధ్యపడుతుంది. మీ ఇష్టదైవాన్నిగాని, మీ గురువునిగాని మీరు ఉపాసించండి. మీకు యిష్టమైన నామాన్ని జపించండి, ఇష్టమైన రూపాన్ని ఆరాధించండి. మీకు ప్రాణాయామము ఇష్టమైతే ప్రాణాయామము చేయండి దానివలన కూడా మనస్సు అణుగుతుంది. ప్రాణనిరోధముకూడా ఉపాసనకు సహకరిస్తుంది. మీరు ఆలోచిస్తే ఆ దేవుడిని గురించే ఆలోచించండి. నిరంతర దైవచింతన వలన కూడా మనోచాపల్యము అణిగిపోతుంది. మనోనిగ్రహము సాధించుటకు 1. వైరాగ్యము, 2. వివేకము, 3. ధ్యానము ముఖ్యము. ధ్యానమునకు ఉపాసన సహకరిస్తుంది. స్మరణమాత్రము చేతనే అరుణాచలేశ్వరుడు మీ అహంకారాన్ని హరించి, ఆత్మజ్ఞానాన్ని మీకు ప్రసాదిస్తాడు.

ప్రశ్న: మీరు ధ్యానాన్ని ప్రోత్సహిస్తారా?

శ్రీనాన్న గారు : ధ్యానము సాధకులకు గాని, జ్ఞానులకు కాదు. ధ్యానమే గమ్యము కాదు, గమ్యము చేరుటకు ధ్యానము ఒక మార్గము మాత్రమే. ధ్యానము కూడా కల్పితమే. ధ్యానము చేసేది ఎవరు? మనస్సు. అసలు మనస్సే లేనప్పడు ధ్యానము చేయుటకు ఎవరూ మిగలరు. సాధకుడు ఉన్నంతకాలము సాధన అవసరమే. అసలు సాధకుడే లేనప్పడు సాధనతో పనేలేదు. దేహమున్న వాడికి రోగము, దేహమే లేనివాడికి రోగమేమిటి? మనోమూలాన్ని శోధిస్తే ధ్యానము చేసే మనస్సు లేదని తెలుస్తుంది.

ప్రశ్న: ఆత్మను తెలుసుకొనుటకు "ఆత్మవిచారణ" సూటిమార్గమని భగవాన్ శ్రీరమణ మహర్షి చెప్పారు - మీ అభిప్రాయమేమిటి?

శ్రీనాన్న గారు : భగవాన్ శ్రీరమణమహర్షి "ఆత్మవిచారణ" చేసి మహర్షి కాలేదు. ఆయన కేవలము ఒక్క "ఆత్మవిచారణ" మార్గాన్నే చెప్పలేదు "శరణాగతి" మార్గాన్ని కూడా చెప్పారు. "పూర్ణశరణాగతి" ఒక్కసారిగా సాధ్యపడదు కాబట్టి "పాక్షికశరణాగతి" కూడా చెప్పారు. పాక్షికశరణాగతిని అభ్యాసము చేయగా చేయగా, అది పూర్ణశరణాగతికి దారిచూపుతుంది. భగవంతుని సంకల్పాన్ని గౌరవించి, ఆయన సంకల్పమే తన సంకల్పముగా అంగీకరించుటయే "శరణాగతి". దేవుని అస్తిత్వముమీద మీకు విశ్వాసములేకపోతే ఆత్మవిచారణ చేసి, విచారణచేసే ఆ "నేను"ను తొలగించుకున్నా, శరణాగతి వలన వచ్చే ఫలితమే మీకు వస్తుంది.

ప్రశ్న: "ఆత్మవిచారణ", దైవధ్యానము ఒక్కటేనా?

శ్రీనాన్న గారు : ఆత్మకు మరోపేరే దైవము. ఆత్మ లేకుండా దైవము ఉండదు. ఆత్మధ్యానమన్నా, దైవధ్యానమన్నా ఒక్కటే. భక్తుడు దేనిని దేవుడంటాడో, జ్ఞాని దానినే

బ్రహ్మమంటాడు. బ్రహ్మమే మనలోని నిజమైన ఆత్మగా ఉన్నది. మనోదేహములను అతిక్రమించి, అహంవృత్తిని తొలగించుకొని, మన సహజస్థితిలో మనము ఉండగలుగుటయే ఆత్మవిచారణాఫలము.

ప్రశ్న: మరికొంచము వివరముగా చెప్పగలరా?

శ్రీనాన్న గారు : మనస్సు ఉంటేనే ఈ లోకం వుంది, దేవుడు ఉన్నాడు. మనస్సు ఉంటేనే నేను వున్నాను, నీవు వున్నావు, వాడు ఉన్నాడు మనస్సు వుంటేనే రాగద్వేషాలున్నాయి, కామక్రోధాలున్నాయి, కష్టసుఖాలున్నాయి, లాభనష్టాలున్నాయి. గాఢనిద్రలో మనస్సు లేదు, అప్పుడు ఈ గొడవలేమీ మనకు గుర్తురావటంలేదు. కనుక మనోనాశనమే ఆత్మవిచారణా గమ్యము. మన నైజము ఆలోచించుట కాదు. కనుక ఈ లోకం గురించి, దేవుడు గురించి ఆలోచించే "ఈ మనస్సు ఎవరు?" అని ప్రశ్నించండి. అప్పుడు మీ మనస్సు ఒక్కసారిగా ఉక్కిరిబిక్కిరై, తలక్రిందులై, అంతర్ముఖమై దాని మూలాన్ని శోధించుట మొదలుపెట్టి, దాని పుట్టుచోటైన హృదయము వైపు ప్రయాణము చేస్తుంది. హృదయస్థానమందు మీ మనస్సును స్థిరముగా నిలిపిఉంచగలిగితే, అది ఆత్మాకారము చెందుతుంది, అమృతానుభవం కలుగుతుంది, ఆనందసాగరంలో ఈదులాడుతారు. ఆనందమే మానవ నైజము.

ప్రశ్న: శరణాగతి - ఆత్మవిచారణా మార్గము వేరువేరుగా అనిపించినా, నిజానికి రెండుమార్గాలు ఒక్కటిగానే కనిపిస్తున్నాయి.

శ్రీనాన్న గారు : కాదు, రెండుమార్గాలు వేరు. కాని, అవి చేర్చే గమ్యము మాత్రము ఒక్కటే. లోకంలో రకరకాల మనస్తత్వమున్న మనుషులు ఉంటారు. ఎవరి సంస్కారాన్ని బట్టి వారు తమకు నచ్చిన పద్ధతిలో సాధన చేసుకోవచ్చును. చివరకు అన్ని మార్గములు చేర్చేగమ్యము మాత్రము ఒక్కటే.

ప్రశ్న: "ఆత్మసాక్షాత్కారము ఎప్పుడౌతుంది" అని భక్తులు అడిగితే "కనిపిస్తున్న ఈలోకము కరిగిపోయినప్పుడు" అని భగవాన్ చెప్పారు. దానిని మాకు కొంచము వివరముగా చెప్పగలరా?

శ్రీనాన్న గారు : తాడును చూసి మీరు పాము అని భ్రాంతి పడుతున్నంత కాలము, ఆతాడు మీకు పాముగానే కనిపిస్తుంది. కాని నిజానికి అది పామా? కాదు, తాడు. ఆతాడును చూసి మీరు పాముఅని అనుకున్నప్పుడు కూడా అది నిజముగా తాడే. మరిఅది పాముకాదు అది తాడని ఎప్పుడు తెలుస్తుంది? దీపం వెలిగిస్తే అది పాముకాదు, తాడని తెలుస్తుంది. అదే విధముగా, మీకు జ్ఞానము కలిగిన తరువాత మీకు కనిపించే ఈ లోకము లోకముకాదని, అది బ్రహ్మమని తెలుస్తుంది. కనుక జ్ఞానజ్యోతిని మీలో వెలిగించండి, ఈ లోకము మాయమైపోతుంది, బ్రహ్మముగా వ్యక్తమౌతుంది.



అధిష్ఠానవస్తువైన తాడు లేకుండా పాము కనబడదు. అదేవిధముగా అధిష్ఠానమైన బ్రహ్మము లేకుండా ఈలోకము లేదు. తాడు తాడుగా కనిపించినప్పుడు పాము కనిపించదు. బ్రహ్మానుభవము పొందినవాడికి ఈలోకము కూడా బ్రహ్మముగానే వ్యక్తమౌతుంది. నిరంతర బ్రహ్మచింతన చేసేవాడు బ్రహ్మానుభవము పొందుటయే కాక, అన్ని సత్కర్మల యొక్క ఫలితము కూడా పొందుతాడు.

ప్రశ్న: మేము లోకాన్ని చెరిపివేయుట ఎలా?

శ్రీనాన్న గారు : మనస్సునకు మరోరూపమే లోకము. మనస్సును అతిక్రమిస్తే లోకాన్ని దాటవచ్చు. మనస్సుకు భిన్నముగా లోకము లేదు. మనోమూలమైన చైతన్యమును దర్శించినవాడికి లోకము కూడా చైతన్యముగానే కనిపిస్తుంది. చైతన్యానుభవము పొందినవాడిని లోకము బంధించదు.

ఒకవేళ మీరు నేరుగా మనస్సును ఆత్మవైపు గురిపెట్టలేకపోతే, పూజ జప ధ్యాన సాధనల ద్వారా మనోనాశనమునకు ప్రయత్నము చేయండి. భగవంతుడు మీకు కేటాయించిన కర్మను అప్రీతితో కాకుండా ప్రీతితో, అయిష్టముతో కాకుండా ఇష్టముతో చేయండి. అట్టి సత్కర్మ మనోనాశనమునకు సహకరిస్తుంది. కర్తలేని సత్కర్మ మనోనాశనమునకు దారిచూపుతుంది.

ప్రశ్న: మనస్సు నశిస్తే జ్ఞానము కలుగుతుందని చెప్తారుగదా మరి మీకు మనస్సు ఉందా?

శ్రీనాన్న గారు : ఔను. నాకూ మనస్సు ఉంది. అది చల్లబడిన సాత్వికమనస్సు. సాత్వికమనస్సు స్వచ్ఛముగా ఉంటుంది. అది పనిచేస్తుంది కాని ఈశ్వరసంకల్పాన్ని అది ప్రతిఘటించదు.

ప్రశ్న: "జ్ఞానికి మనోనాశనమౌతుంది" అని శ్రీరమణస్వామి చెప్పారు గదా మరి ఆ మనోనాశనమెలా?

శ్రీనాన్న గారు : మనోనాశనమంటే కాలిపోయిన తాడు పైకి తాడులాగే కనిపిస్తుంది కాని దేనిని బంధించటానికి అది పనికిరాదు. మనోనాశనమైన జ్ఞాని మనస్సుకూడా లోకములోని ఏ సంఘటనకు చలించదు, అది బంధించబడదు. మనోనాశనము కాకుండా ఏజీవుడూ జ్ఞానికాలేడు. నిరంతరము మనస్సును హృదయగుహలో నిలిపిఉంచితే మనస్సు శుద్ధి అవుతుంది. పరిశుద్ధమైన మనస్సు ఆత్మాకారము చెందుతుంది. శుద్ధమనస్సును సాధించుటకే ఆధ్యాత్మికసాధన.

ప్రశ్న: మీరు చెప్పే "శుద్ధమనస్సు" - బౌద్ధులు చెప్పే "మనస్సులేని స్థితి" ఒక్కటేనా?

శ్రీనాన్న గారు : ఔను - ఒక్కటే. అందులో సందేహము లేదు.

ప్రశ్న: మరి మనస్సులోని సంస్కారముల సంగతేమిటి?

శ్రీనాన్న గారు : మనస్సులోని సంస్కారములు గతజన్మలనుంచి వస్తూవుంటాయి. మనిషి ఫలితాన్ని ఆశించి పనిచేస్తాడు, ఆ వచ్చిన ఫలితాన్ని అనుభవిస్తాడు. ఆ అనుభవములోనుంచి సంస్కారము పుడుతుంది. ఆ సంస్కారము బీజరూపమున హృదయములో దాగివుండి, మరుజన్మకు వెంట వస్తుంది. మరుజన్మలో ఆ సంస్కారములోనుంచి తలంపు పుడుతుంది. ఆ తలంపు వాడిచేత పనిచేయిస్తుంది. వచ్చిన ఫలితాన్ని వాడు మరల అనుభవిస్తాడు, ఆ అనుభవములోనుంచి ఆ సంస్కారము మరింత బలపడుతుంది, ఇది కర్మసముద్రము. కర్తృత్వబుద్ధి ఉన్నంతకాలము మానవుడు ఈ కర్మసముద్రాన్ని దాటలేడు. కర్తృత్వబుద్ధితో మంచిపనిచేసినా, చెడ్డపనిచేసినా సరే తప్పనిసరిగా సంస్కారము పుడుతుంది. ఈ సంస్కారములే మన ఆధ్యాత్మికఅభివృద్ధికి అవరోధాలై, మన ఆత్మానుభూతికి అడ్డుపడుతున్నాయి. మన సాధనల గమ్యము సంస్కార నిర్మూలనే. అది కర్మమార్గమా, భక్తిమార్గమా, ధ్యానమార్గమా, జ్ఞానమార్గమా అని కాదు, ఎవరు ఏమార్గములో ప్రయాణము చేసినప్పటికీ ఆత్మానుభవము పొందుటకు నిశ్శేషముగా సంస్కార నిర్మూలన జరిగితీరాలి, ఇందులో రాజీలేదు. ఒక్క సంస్కారము మిగిలినప్పటికీ అది మరుజన్మకు హేతువౌతుంది. మన సంస్కారములే మనకు బంధాలు, అవే మన కాళ్లకు సంకెళ్ళు!

ప్రశ్న: సాత్వికమనస్సును సంపాదిస్తే సంస్కారములు బంధించవా?

శ్రీనాన్న గారు : సాత్వికమనస్సును సంపాదించుట అవసరమే. కాని సాత్వికమనస్సే మన గమ్యము కాదు, మన గమ్యము సంస్కారనిర్మూలన. సాత్వికమనస్సు వలన సంస్కారముల యొక్క బలముతగ్గి, అవి సన్నగిల్లి రాలిపోతాయి, అవి బంధించవు. రాగద్వేషాలవల్లనే మానవుడు బంధములో చిక్కుకొంటున్నాడు. రాగద్వేషాలు తలంపుల రూపములోనే వస్తూవుంటాయి. తలంపులకు మూలము సంస్కారములే. సంస్కారములు పెంచుకొంటే మనస్సు బహిర్ముఖమై బంధములో చిక్కుకుంటాడు. సంస్కారములనుంచి విడుదలపొందితే వాడు సుఖిఅవుతాడు, సంసారచక్రములో బంధింపబడడు, పరమశాంతిని పొందుతాడు.

ప్రశ్న: అయితే, సంస్కారములనుంచి బయటపడుట ఎలా?

శ్రీనాన్న గారు : మీరు నిరంతరము సంస్కారములను గురించి ఆలోచిస్తూ సంస్కారములను మీరు నిర్మూలించుకోలేరు. మీరు ఆలోచించిన కొలదీ సంస్కారములు మరింత బలపడతాయి. మీరు దేనిని చింతిస్తూ ఉంటారో అదే మీరు అవుతారు. కనుక నిరంతరము మీరు ఆత్మను గురించో, దైవాన్నిగురించో, మీ గురువును గురించో ఆలోచిస్తూఉంటే మీ సంస్కారములు విజృంభించుటకు మీ మనస్సులో చోటుదొరకక వాటివేగము తగ్గి, క్రమముగా చిక్కి, సన్నగిల్లి, రాలిపోతాయి. నిరంతర ఈశ్వరచింతన వలన మీ సంస్కారములు దహించబడతాయి. ఈశ్వరభక్తి అత్యంతముఖ్యము.

ప్రశ్న: జీవన్ముక్తుడికి - విదేహముక్తుడికి తేడా ఏమిటి?

శ్రీనాన్న గారు : జీవించియుండగా అద్వైతానుభవము పొందినవాడిని జీవన్ముక్తుడంటారు. గీతలో వాసుదేవస్వామి జీవన్ముక్తుడినే స్థితప్రజ్ఞుడని, గుణాతీతుడని, జ్ఞానిఅని కూడా చెప్పాడు. భగవాన్ శ్రీరమణమహర్షి, గౌతమబుద్ధుడు, ఆదిశంకరాచార్యులు వంటివారిని జీవన్ముక్తులంటారు. శరీరము మరణించే టైములో అద్వైతానుభవము పొందినవాడిని "విదేహముక్తుడు" అని అంటారు. ఏసుక్రీస్తు తుదిశ్వాస విడిచిపెట్టే టైములో "నేను - నాతండ్రీ ఒక్కటే" అన్నాడు. అద్వైతస్థితిని ఆయన అప్పుడు అందుకున్నాడు. దీనినే విదేహముక్తి అంటారు.

ప్రశ్న: ఇదంతా వింటూవుంటే, ఒక గురువును ఆశ్రయించుట మంచిదనిపిస్తుంది.

శ్రీనాన్న గారు : జ్ఞానులను, ఋషులను, ముముక్షువులను, సహృదయులను దర్శించుట మంచిది. సత్పురుషులను దర్శించుటవలన మీలో జ్ఞానము పొందాలనే జిజ్ఞాస కలుగుతుంది, మీ చైతన్యస్థాయి పెరుగుతుంది, మీ మనస్సు పరిశుద్ధమౌతుంది. సత్యసాక్షాత్కారము పొందుటకు మంచితనముకూడా కావాలి. మీరు నిరంతరము మంచినే చూడండి, మంచినే వినండి, మంచినే చేయండి అదికూడా సాధనే, సత్పురుషులసహవాసముతో అది సమానము. సత్పురుషులతో మానసికఅనుబంధము చాలా మంచిది, దానివలన మీ మనస్సు పక్వానికి వస్తుంది.

ప్రశ్న: ఎవరు గురువు?

శ్రీనాన్న గారు : ఉన్న సత్యము ఒక్కటే. అది ఆత్మ. ఆత్మఅన్నా, దేవుడుఅన్నా, గురువుఅన్నా ఒక్కటే అందులో భేదము లేదు. ఆత్మను దర్శించినవాడే గురువు శబ్దానికి అర్హుడు. గురువు ముఖ్యముగా రెండు అర్హతలు కలిగిఉండాలి. 1) తాను ఆత్మానుభవము పొంది ఉండాలి, 2) తానుపొందిన ఆత్మానుభవాన్ని ఎదుటివారికి అర్థమయ్యేటట్లు బోధించగలగాలి.

కాని, ఆధ్యాత్మికముగా మీకు మార్గము చూపుటకు ఒక జ్ఞానే గురువు కానక్కరలేదు, చైతన్యస్థాయిలో మీకంటే పైమెట్టున ఉన్నవాడుకూడా మీకు మార్గము చూపగలడు, క్రిందితరగతి విద్యార్థికి లెక్కలు చెప్పటానికి గణితశాస్త్రవేత్త అక్కరలేదు, పై తరగతివాడు

సరిపోతాడు.

ప్రశ్న: గురువు పాత్ర ఎంతవరకు?

శ్రీనాన్న గారు : దేవుని ప్రతినిధే గురువు. గురువు దేవుని స్వాధీనములో ఉంటాడు. గురువు దేహాన్ని దేవుడు ఉపయోగించుకుంటాడు. అందుకే గురువుదేహము ఒక దేవాలయము. గురువు సన్నిధిలో ఉండుట మంచిది. గురువు సాన్నిధ్యము సాధ్యపడనప్పుడు గురువుతో మానసికఅనుబంధము కలిగివున్నా సరిపోతుంది మీరు తరించటానికి. గురువుతో మీకు ఎంతబలమైన మానసిక అనుబంధము కలిగిఉంటే అంత ఆధ్యాత్మికబలము మీకు వస్తుంది. మానవజాతిని దుఃఖస్పర్శలేని మోక్షస్థితికి తీసుకొనివెళ్ళుటయే గురువు చేసేపని.

ప్రతీరోజు నా వద్దకు ఎందరో వస్తూవున్నారు, ఎందుకు? డబ్బుకోసమా? ఉద్యోగం కోసమా? ఆరోగ్యం కోసమా? ఏమి ఆశించి వారందరు నాదగ్గరకు వస్తున్నారు? కేవలము దుఃఖస్పర్శలేని సుఖాన్ని కోరి వస్తున్నారు. దుఃఖస్పర్శలేని సుఖాన్ని మీ దగ్గరవున్న ధనముపెట్టి బజారులో కొనలేరు, అది కేవలము గురువు అనుగ్రహము వలన మాత్రమే వస్తుంది.

ప్రశ్న: నిజమైన గురువును ఎలా గుర్తించాలి?

శ్రీనాన్న గారు : దీనికి విశ్వాసము చాలా ముఖ్యము. ఎవరి సన్నిధిలో మీకు శాంతి, సుఖము, ఆనందము అందుతుందో, మనోవికాసము కలుగుతుందో, దేహబంధములోనుంచి బయటపడటానికి దారి దొరుకుతుందో అతడే మీకు గురువు. మీ నుంచి ప్రతిఫలం ఆశించేవాడు గురువు కాదు, బరువు. ఉదాహరణకు శ్రీరమణస్వామి సన్నిధిలో మీకు శాంతి, సుఖము, ఆనందము అందుతూవుంటే ఆయనే మీకు గురువు. గురువు అంటే కేవలము దేహమాత్రుడు కాదు.

ప్రశ్న: జ్ఞాని ఆత్మానందములో మునిగి శూన్యములోనికి చూస్తూవుంటాడని, అతని కళ్ళకు ఈలోకము కనిపించదని కొందరు సాధకుల అభిప్రాయము. మరి మీ అనుభవము ఏమిటి?

శ్రీనాన్న గారు : అది నిజమైనస్థితి కాదు. మనస్సుఉంటేనే ఈలోకంవుంది. మనస్సులేనివాడికి లోకం ఏమిటి? జ్ఞాని స్వరూపము ఆత్మ. తన స్వరూపముగానే జ్ఞానికి ఈలోకము కనిపిస్తుంది. మీరుకూడా జ్ఞానికి తనస్వరూపముగానే కనిపిస్తారు. వేరుభావన ఉంటే వాడు జ్ఞానికాడు.

ప్రశ్న: మా కళ్ళల్లోకి మీరు చూస్తున్నప్పుడు మీ కళ్ళకు ఏమి కనిపిస్తున్నది?

శ్రీనాన్న గారు : మీ కళ్ళల్లోకూడా నన్ను నేనే చూసుకుంటున్నాను.



ప్రశ్న: మీరు చూస్తూవుంటే మాకు ఆనందము వస్తుంది ఎందుకని?

శ్రీనాన్న గారు : మీకు ఆనందాన్ని యివ్వాలని జ్ఞాని అనుకోడు. సంకల్పము ఉంటే వాడు జ్ఞానికాడు. ఈ లోకానికి మేలుచేయాలని అనుకోవటముకూడా జీవలక్షణమే. చంద్రుడు నుంచి చల్లదనము, సూర్యుడునుంచి కాంతి ఎంత సహజంగా ప్రసరిస్తున్నాయో అంతసహజంగా జ్ఞాని నుంచి శాంతి ప్రసరిస్తుంది, ఆనందము వర్షిస్తుంది.

ప్రశ్న: ఇంకా చెప్పేది ఏమైనా వుంటే మాకు అనుగ్రహించండి?

శ్రీనాన్న గారు : మీ దేహాన్ని ప్రారబ్దానికి విడిచిపెట్టండి, జరగవలసినది ఏదోజరుగుతుంది. మనోదేహములతోటి తాదాత్మ్యమును తగ్గించుకోండి. భగవంతుడు మీకు ఇచ్చిన అవకాశములను సద్వినియోగము చేసుకొని, సత్యాన్వేషణకు ఉపయోగించుకోండి. ఈశ్వరదర్శనం కావాలనుకుంటే మీలోనున్న వ్యతిరేఖభావాలను విడిచిపెట్టండి, అనుకూలభావాలను అలవరచుకోండి. వ్యతిరేఖభావాలున్నవారికి దూరముగా ఉండండి, అనుకూల భావాలున్న వారితో స్నేహాలు చేయండి. అనుకూల భావాలున్న సహృదయులతో సహవాసము చేస్తే మీకు ఆత్మవిశ్వాసము పెరుగుతుంది. ఆత్మవిశ్వాసము ఉన్నవాడే ఆత్మను దర్శిస్తాడు.

ఈ సృష్టిలో ప్రతిజీవుడు కోరుకునేది దుఃఖస్పర్శలేని సుఖాన్ని. దుఃఖస్పర్శలేని సుఖం ఒక్క ఆత్మలో తప్ప మరెక్కడా లేదు. దుఃఖస్పర్శలేని సుఖాన్ని మీరు పొందాలని అనుకుంటే మీరు ఆత్మను తెలుసుకొని తీరాలి.

## సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు

5-5-03 నుండి 2-06-03 వరకు క్యాంపు

## "జ్ఞాపకాలే జీవితానికి బంధాలు - బరువులు"

పర్వతశిఖరంనుండి క్రిందికి జారిన రాయి అధఃపతనమును చవిచూచినట్లే పరమాత్మ నుండి చ్యుతుడైన జీవుడు ఈ స్వప్నప్రపంచాన్ని నిజమని భ్రమిస్తూ పతితుడౌతున్నాడు. జ్ఞాపకాలు అనేవి మనోపరిధిలోనివి - జ్ఞాపకాల బరువులతో మడతలు పడ్డ మనస్సు నిజమైన స్వచ్ఛతను పొందలేదు. తృప్తిగా నవకాయ పిండివంటలతో భోజనం చేసినవాడు తిరిగి అవి ఎదురుగా ఉన్న వాటిని కోరుకోడు, జ్ఞాని ఆత్మానందాన్ని రుచి చూడటం వల్ల వాడికి భోగవాంఛలు ఉండవు. దృశ్యాన్ని గురించిన జ్ఞానమే బంధము - దృశ్య నివృత్తియే మోక్షం-దానిలో ఏదో ఒకటి మనం ఎన్నుకోవచ్చును. అజ్ఞాని మనస్సులో యీజ్ఞాపకాలు తేగల పాతరలో తేగల్లా ఉంటాయి. ఏజ్ఞాపకాన్ని ఆశ్వాదించినా పాతరకు నీళ్ళుపోసినట్లే, అప్పడు అవిమొలకెత్తుతాయి, మానులౌతాయి, తరువాత దాన్ని కూల్చటం కష్టం. "ఇద్దరు సన్యాసులు నదిని ఈదుకొంటూ దాటటానికి ప్రయత్నిస్తూ ఉంటే ఒక యువతి వారితో దీనంగా ఇలా అంది. "అయ్యా నేను ఉదయం పనికై యివతలికి వచ్చినప్పడు నదిలో నీరు ఇంత ఎక్కువలేదు. నన్ను కూడా మీరు అవతల ఒడ్డుకు చేర్చండి లేకపోతే, నాపిల్లలు చీకటిలో ఆకలితో అలమటించి పోతారు" అని వాపోగా ఒక సన్యాసి ఆమెను తన భుజంపై ఆన్చుకొని అవతలకి చేర్చాడు. రెండు గంటల తరువాత రెండవ సన్యాసి "సోదరా! మనం స్త్రీని తాకకూడదని ప్రతినపూనాము, నీవు మహాపాపం చేసావు, నీవు ఆమెను తాకటం వల్ల కొంత సుఖం పొందావు కదా!" అనగా మొదటి సన్యాసి "నేను ఆమెను రెండుగంటల క్రితమే క్రిందికి దింపేశాను, నీవు యింకా మోసుకొని వస్తున్నట్లున్నావు కదా" అన్నాడు. అలాగే అజ్ఞానిచేసేపని ఒక్కటే, నిరంతరం తన పనికిమాలిన జ్ఞాపకాల బరువులను మోసుకొని బాధపడుతూ తిరుగుతున్నాడు. నిద్రలో మినహాయించి ఒక్క నిమిషం కూడా వాటిని క్రిందికిదింపి వదిలించుకోలేకపోతున్నాడు. గతిని తనకు తానే నిరోధించుకొంటున్నాడు. మహావృక్షాన్ని వేలాది పక్షులు ఆశ్రయించి ఉన్నాయి, ఆవృక్షాన్ని పదునైన గొడ్డలితో మొదలంతా నరికితే వృక్షం కూలి పక్షులు అన్నీ ఎగిరి పోతాయి, అలాగే "నేను ఎవడను?" అనే జ్ఞాన గొడ్డలితో అహంకారమనే మహావృక్షాన్ని నరికితే దాన్ని ఆశ్రయించిన జ్ఞాపకాలనే పక్షులు ఎగిరిపోతాయి, కొండంత ఆనందం కనులముందు ఉంటుంది. దానికి గురుకృప ఎంతగానో సహకరిస్తుంది.

- సాగిరాజు రామకృష్ణంరాజు, అర్థవరం



## జిన్నూరు శ్రీరమణక్షేత్రంలో
## భగవాన్ శ్రీ రమణమహర్షి ఆరాధన ఉత్సవం





ది. 28-4-2003వ తేదీన భగవాన్ శ్రీ రమణమహర్షి ఆరాధన ఉత్సవం
జిన్నూరు శ్రీ రమణక్షేత్రంలో జరిగినది.
ఈ సందర్భంగా ఉదయం గం॥8-00 లకు పూజాకార్యక్రమములు,
మధ్యాహ్నం గం॥ 12-00 లకు భగవాన్ జీవితచరిత్ర వీడియోప్రదర్శన జరిగినవి.
మధ్యాహ్నం గం॥ 2-00 లకు సద్గురు శ్రీ నాన్నగారు ప్రవచనం చేసినారు.